# దేవుడు మంచివాడు

"అయ్యా రండి.. రండి... బాబూ రండి. రండి.. సార్ రండి.. జోళ్ళిడి శెల్లండి బాబూ.. శెప్పులు బాబూ... శెప్పులిడిశెల్లండి బాబూ... అమ్మా రండి... రండమ్మా రండి..."

ఎవరూ రాలేదు, అరవలేక ఆయాసమొచ్చింది కోటిగాడికి.

తన ముందున్న చెప్పులన్నీ లెక్కబెట్టాడు. తొమ్మిది జతలున్నాయి. తొమ్మిదైదులు నలభై అయిదు... నలభై అయిదు పైసలు. ఇంకా యాభై అరవై పైసలన్నా వత్తేగాని ఈ పూటన్నా కూడుదినే ఆశుండదు... పొద్దు నొచ్చిన ముప్పయి పైసలూ కాఫీ నీళ్ళకే సాల్లేదు. యాపారం ఇయ్యాల మరీ ఇట్టా ఏడిసిందేంటి"

మళ్ళీ ఒక్కసారి బిగ్గరగా, గుళ్ళో కెళ్ళే అయ్యల్నీ, అమ్మల్నీ కాళ్లకి చెప్పులూ బూట్లూ వున్న వాళ్లందర్నీ పిలిచాడు. బ్రతిమాలాడు. ఎవరూ రాలేదు. అసలివ్వాళ గుళ్లో కొచ్చే భక్తులే తక్కువగా వున్నారు. ఆ వచ్చిన కొద్దిమందిలో ఎక్కువమంది పక్కనున్న కాంతమ్మ దగ్గరే చెప్పులు విడిచి వెళ్తున్నారు. పూల అమ్మకంతో పాటు గుళ్ళోకెళ్ళేవాళ్ళ చెప్పుల రక్షణ బాధ్యత కూడా ఈ మధ్యనే స్వీకరించింది కాంతమ్మ.

"వొయసులో వుండాది గదా, కంటికి నిండుగా వుంది గదా అని అంతా దాని దగ్గరికే ఎగబడతన్నారు.. దొంగ నా కొడుకులు..." అని తిట్టుకున్నాడు కోటి గాడు.

కోటిగాడు కూడా ఈ 'యాపారం' మొదలెట్టింది ఈ మధ్యనే. అంతకుముందు బస్ డిపోలో సోడాలమ్మేవాడు. అంతకుముందు రైల్వేస్టేషన్‌లోనూ, వీధుల్లోనూ అడుక్కునేవాడు. వాడసలు రైల్వే స్టేషన్‌లోనే పుట్టాడు. వాడి తల్లి అక్కడే అడుక్కునేది. తన తండ్రెవడో వాడికి తెలీదు. తల్లెవరో తెలుసుకునే సమయానికి నాలుగేళ్ళ వయసులో వున్న తనని గాలికి విడిచిపెట్టి, ఆ తల్లి మరో ముష్టివాడితో మరెక్కడికో లేచిపోయింది. అప్పటినుంచీ

అడుక్కుతింటూనే, ఒక్కోసారి రోజులు తరబడి ఏమీ తినకుండానే పెద్దవాడయిపోయాడు. ఇరవయ్యేళ్ళొచ్చాయి. ఇరవయ్యేళ్ళింకా రాకముందే - "పాతికేళ్ళొచ్చాయి. ఎద్దులా వున్నావు. అడుక్కు తినకపోతే కష్టపడి బతకరాదూ. సోడా బుడ్లమ్ము...బుడ్డికి పైసా ఇస్తాను" అన్నాడు బస్స్టాండులో ఒకనాడొక ధర్మాత్ముడు. అప్పట్నించీ అర్నెల్లు సోడాలమ్మాడు కోటిగాడు. ఒకనాడు రోడ్డుమీద కొందరు మహాయోధులు ఒకరి మీదొకరు బాంబుల్లా విసురుకోడానికి కోటిగాడి బండిలో సోడా కాయలే దొరికాయి. నాలుగు బుడ్లు పగిలిపోయాయి. యజమాని కొట్టిన దెబ్బలతో వీపూ, తిట్టిన తిట్లతో మనసూ చితికిపోయి, ఆ 'ఉద్యోగం' వదిలేసి, పెట్టుబడి లేని ఈ 'యాపారం' పెట్టాడు కోటిగాడు.

మరీ అంత చిన్నదీ, మరీ అంత పెద్దదీ కాని ఆ పట్నంలో - చిల్లర దేవుళ్ళవీ, దేవతలవీ కాక, దేవుళ్ళలో బాగా పాప్యులారిటీ వున్న వాళ్ళవి నాలుగు ఆలయాలున్నాయి. మొదటి మూడూ, రాముడు శివుడు, ఆంజనేయస్వాముల వారి ఆలయాలు. నాలుగోది వేంకటేశ్వరస్వామిది.

కొన్ని వందల తలకాయలు మార్చేని, ఐదారు తలకాయలు తీయించేసి, పది లక్షల దాకా సంపాదించి, రెండు మిల్లులూ, నాలుగు బిల్డింగులూ, ఓ అరడజను పదవులూ ఓ డజను మంది అధికారుల్నీ కొనేసి, ప్రజానాయకుడిగా, దాతగా మహాభక్తుడిగా కీర్తి గడించి, ఇటీవలే కీర్తిశేషుడయిన ఒక మహానుభావుడు - చావబోయే ముందు ఏడుకొండల వాడు కల్లో కనిపించి చెప్పిన మాట శిరసావహించిన వాడయి, ఈ వెంకటేశ్వరాలయం కట్టించి మరీ చచ్చారు. గుళ్ళో దేవుడి విగ్రహం పక్కనే ఆ పరమ భక్తాగ్రేసరుడి విగ్రహం కూడా పెడదామనుకున్నారు గాని, మళ్ళీ దేవుడికి కోపమొస్తుందేమోనని జడిసి, గుడి కెదురుగా నాలుగు రోడ్లూ కలిసే చోట పెట్టేశారు.

మిగతా మూడింటిలోకంటే, ఈ వెంకటేశ్వరాలయంలోనే భక్తుల రద్దీ ఎక్కువ. అందుకే కోటిగాడు తన 'యాపారం' ఇక్కడ ప్రారంభించాడు. గుళ్లో కెళ్ళే వాళ్ల పాదరక్షలు దాచిపెట్టి, తిరిగి వెళ్ళేప్పుడు ఎవరివి వాళ్ళకి ఇచ్చి, మనిషికి అయిదుపైసలు చొప్పున తీసుకుంటాడు మొదట్లో రోజుకి కనీసం మూడు నాలుగు రూపాయలు కళ్ళ చూసేవాడు. అది చూసి కన్ను కుట్టిన మరో ఇద్దరు కూడా పోటీకి దిగారు. అయినా కోటిగాడి దగ్గరకే ఎక్కువమందొచ్చేవారు గాని, పువ్వులమ్మే కాంతమ్మ పువ్వులమ్మకంతో పాటు ఈ వృత్తి కూడా స్వీకరించాక ఎక్కువమంది ముఖ్యంగా మగాళ్ళు దాని దగ్గరకే వెళ్ళడం ప్రారంభించారు.

పువ్వులమ్మే కాంతమ్మ పువ్వులతో పాటు, పూలచెండు లాంటి తన శరీరాన్ని కూడా అమ్ముతూ వుంటుంది. అంచేత పూలకోసమో, పూలచెండు కోసమో దాని దగ్గర కెళ్ళేవాళ్లంతా, గుళ్ళో కెళ్ళే ముందు అయిదు పైసలడిగితే పది పైసలిచ్చి చెప్పులు కూడా దాని దగ్గరే

విడిచిపోతారు.

"అయ్యా రండి బాబూ రండి... రండి సార్ రండి... ఇటు సార్ యిటు.. శెప్పులిడిపి పొండి బాబూ... అమ్మా ... అమ్మగారూ... రండమ్మా రండి..."

మళ్ళీ అరవడం మొదలెట్టాడు కోటిగాడు.

ఎవరూ రాలేదు. ఆకలి కరకరలాడుతోంది. పొద్దున్ననగా కాకా హోటల్లో తాగిన కాఫీ నీళ్ళు తప్పితే పొట్టలో ఏమీ పడలేదు.

కాలేజీ కుర్రాళ్ళు కొందరు గంట నుంచీ గుడి ముందు నిలబడి, వచ్చేపోయే ఆడపిల్లలకి పోజులు కొడుతున్నారు. "లోపలకన్నా యెల్లరే యెదవనాయాళ్ళు .. ఎల్తే శెప్పులన్నా యిడిసెల్తారేమో... ఇయ్యాల పెద్ద వత్తిడి లేదుగా... జనం కిటకిట లాడుతూ వుంటే ఈ పాటికి లోపలికి లగెత్తేవారు అప్పుడయితే ఆ వొత్తిడిలో తోపుళ్ళు... తొక్కిళ్ళు... నొక్కుళ్ళు... ఏమయినా శెయ్యొచ్చు. అళ్ళు వచ్చేదందుకేగా అసలు.. దేముడి కోసమేంటి అళ్ళొచ్చేది.. అళ్ళన్న మాటేంటి. సదువుకునే ఆడపిల్లలు, వయసొచ్చినోళ్ళు, వయసు ముదిరినోళ్ళు. పెద్ద పెద్ద కారుల్లో తిరిగే అమ్మలు, తల్లులు, ఎంతమంది ఇందుకోసం, ఈ తోపుళ్ళ కోసం తొక్కిళ్ళ కోసం నొక్కుళ్ళ కోసం, మగాళ్ళ కోసం రాటల్లేదు... అమ్మా ... రండమ్మా.. రండి తల్లీ... రండి..."

ఖరీదయిన చీరె, చేతుల్లేని బ్లౌజ్, పెద్ద సోకయిన ముడి, చేతిలో పెద్ద బాగ్‌తో ఒకావిడ కోటిగాడి దగ్గరకొచ్చింది. చీరె కొద్దిగా పైకెత్తి షూ బెల్టు విప్పబోయింది. కోటిగాడు వెంటనే-

"నేనిప్పుతానండమ్మగారూ... నే నిప్పుతా" నంటూ తనే ఆవిడ షూస్ విప్పాడు. "ఏదమ్మా ! సీర మరికొంచెం పైకెత్తు.. మా తల్లే కాళ్ల నిండా ఈ మచ్చలేంటి పైన బొటారం. లోన లొటారమేనా... అందుకేనా తల్లీ సీర అంత కిందకి పాదాలు మునిగిపోయేట్టు కట్టావ్"....

బాగ్ ఊపుకుంటూ , ఎడంగా వున్న కాలేజీ వున్న కాలేజీ కుర్రాళ్ళ వేపు దొంగచూపులు చూస్తూ, గుడిలోకెళ్ళి పోయింది ఆ భక్తురాలు.

ఆ తరవాత చాలామంది భక్తులొచ్చారు.

ఆ వూళ్ళో ప్రసిద్ధ వర్తకులు వెంకయ్య శెట్టిగారు కార్లో వేంచేశారు. బజార్లో ఎక్కడా దొరకని వస్తువులన్నీ నల్ల బజారులో అమ్మి ప్రజాసేవ చెయ్యడంలో వారు పేరు పొందారు. కట్టిన రెండేళ్ళకే కూలిపోయిన కాలేజీ బిల్డింగు కట్టిన కంట్రాక్టర్ కామరాజు గారు ఆ తరువాత విచ్చేశారు. ఆయనకా కంట్రాక్టు ఇప్పించి, కాలేజీతో పాటు తనూ ఓ బిల్డింగు కట్టించుకున్న కాలేజీ కమిటీ ఛైర్మనూ, మునిసిపల్ ఛైర్మనూ కూడా అయినటువంటి రామనాథం గారు లేపుకొచ్చిన దాన్ని కూడ వెంటబెట్టుకుని భగవద్దర్శనార్థం ఏతెంచారు. మునిసిపల్ ఛైర్మన్‌గా పోటీ చేసి ఓడిపోయి, ఈసారి పార్లమెంటుకే పోటీ చెయ్యాలన్న సదుద్దేశంతో - ఇప్పటికారు

పార్టీలు మార్చిన మహానాయకులు రామిరెడ్డి గారు కూడా మరి కాస్సేపటికి వచ్చారు.

ఈరకంగా ఇలాంటి భక్తాగ్రేసరులు చాలామంది వచ్చినప్పటికీ కోటిగాడి దగ్గర కెవరూ రాలేదు; కడుపు మండుతోంది; ఆకలితోనూ కోపంతోనూ కూడా. "ఈళ్ళు అంతా భక్తులా... ఈళ్లయితే గుడినీ గుళ్ళో లింగాన్ని కూడా మింగేసే దొంగ నా కొడుకులు..." అనుకున్నాడు.

మరికాస్సేపు అరవగా అరవగా ఒకడొచ్చాడు. సూటూ బూటూ వేసుకుని డాబుగా వున్నాడు. కోటిగాడు బూట్లు విప్పాడు. లోపల మేజోళ్ళున్నాయి. అవికూడా తనే విప్పాడు. (అబ్బ కంపు... మేజోళ్ళుతికి ఎన్నాళ్ళయింది బాబూ.. యిదేనా బాబూ నీ డాబు... నీకంటే నేనే సుబ్రంగా వుంటానే...'సూట్‌వాలా గుళ్ళోకెళ్ళిపోయాడు.

లోపల్నించి ఒక పూజారి గబగబా వచ్చి, చాటుగా తెచ్చి కొబ్బరి కాయలు - కాయలూ పళ్ళూ అమ్మే దుకాణంలో పడవేసి, ఏమీ ఎరగనట్టు మళ్ళీ లోపలికి పోయాడు.

గుళ్ళోకొచ్చే వాళ్ళలో ఒకటి కంటే ఎక్కువ కొబ్బరికాయలు తెచ్చిన వాళ్ళదగ్గర తీసుకు దాచినవన్నీ ఇలా దొంగచాటుగా అమ్మి, పూజార్లు ముగ్గురూ పంచుకుంటారు.

"ఓరి భగవంతుడా ! ఎంత మాయ ? ఎంత మోసం.." అనుకుని నిట్టూర్చాడు కోటిగాడు.

ఆ తరవాత ఒక పెద్ద మనిషి వచ్చాడు. అతనా వూళ్ళో ఒక చిన్న హోటలూ, పెద్ద వేశ్యాగృహమూ నడుపుతుంటాడు. కోటిగాడా పెద్ద మనిషిని చూడగానే, 'ముండల కంపెనీ వోడొచ్చాడు' అనుకుని 'రండి బాబూ రండి' అని ఆహ్వానించాడు. కోటిగాడు ఐదు పైసలడిగితే మూడు పైసలే ఇస్తానని బేరం చేసి, వొప్పుకోనందుకు తిట్టుకుని "సరే తీసుకో... కొత్త చెప్పులు.... నిన్నే కొన్నాను...జాగ్రత్త....అని హెచ్చరించిపోయాడు, ముండల కంపెనీ భక్తుడు.

కోటిగాడు కూడా ముండల కంపెనీ వాణ్ని మనసులో తిట్టుకున్నాడు. ఆపైన పావుగంట... అరగంట.. గంటయినా ఎవరూ రాలేదు. విడిచి వెళ్ళిన వాళ్లంతా చెప్పులు తీసుకెళ్ళిపోయారు - ముండల కంపెనీ వాడు తప్ప.

పైసలు లెక్క పెట్టుకున్నాడు కోటిగాడు. యాభై అయిదు పైసలున్నాయి. ఆకలి మండుతోంది. నీరసంగా ఉంది. 'ఈ ఒక్క జతా కూడా ఇచ్చేసి ఇయ్యాల్టికిక యాపారం ఎత్తేత్తనే మంచిది. ఎవడూరాండే.. ఈడేడీ.. లోపల్నించి ఇంకా రాడే. ముండల యాపారం జేసేటోడు ఆడికీ ఇంత బక్తా.. ఏం జేత్తన్నాడో ఇంకా లోపల.."

కూర్చున్న చోటునుంచి లేచి, కాస్సేపు అటూ ఇటూ తచ్చాడి గుడి గుమ్మం ముందుకెళ్ళి, లోపలికి తొంగి చూశాడు. ఆ పెద్ద మనిషి ఎక్కడా కనపళ్ళేదు. ఈడెక్కడ జచ్చాడో. అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు. ముండల కంపెనీ వాడి చెప్పుల్లో ఒకదాన్ని ఎక్కడిదో బక్క చచ్చిన కుక్క ఒకటి రుచి చూస్తోంది. వెంటనే కుక్క మీదికి రాయి విసిరి అదిలించాడు

కోటిగాడు కుక్క చెప్పు నోట్లో కరుచుకుని పరుగు లంకించుకుంది కోటిగాడు అరుస్తూ, బూతులు తిడుతూ, మధ్యమధ్యలో ఒంగి రాళ్ల ఏరి విసురుతూ, కుక్క వెంటపడ్డాడు కుక్క బక్కదైనా వేగంగా పరుగెత్తుతోంది కోటిగాడు దానితో పాటు పరుగెత్తలేకపోతున్నాడు కుక్క వాడికంటే యిరవై ముప్పయ్ గజాలు ముందుంది ఆ బజారు మలుపు తిరిగింది సొంతం తిరగలేదు తిరగబోయి ఎదురుగా వస్తున్న లారీని చూసి జడుసుకుని తప్పుకోబోయి వెనకనుంచి వస్తున్న బస్సు కిందపడిపోయింది బస్సూ ఆగలేదు, లారీ ఆగలేదు, దారే పోయేవాళ్ళూ ఆగలేదు ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు కోటిగాడు మాత్రం ఆగాడు కుక్క చచ్చిపోయింది ఎముకలు విరిగి వెళ్ళుకొచ్చాయి తల పచ్చడయింది చెప్పు కూడా ఇంకా పళ్ళ మధ్యనే వుంది

చచ్చిన కుక్క బతికొచ్చి తన గుండెకాయ పళ్ళతో పట్టి పీకుతున్నట్టుగా వుంది కోటిగాడు కాస్సేపు అలాగే చూస్తూ నిలబడ్డాడు ఇంక చూడలేక గబా గబా వెళ్ళి చచ్చిన కుక్క నోట్లోంచి చెప్పు బలవంతాన లాగి 'పిచ్చిముండని సేతులారా సంపానే దానికెన్నాళ్ళనుంచి కూడు లేదో శెప్పు మీదాశ పడింది' అనుకుంటూ గుడిదగ్గరకెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు

చెప్పు పట్టీ ఒకటి పూర్తిగా పాడైపోయింది తెగిపోయింది చాలా చోట్ల కుక్క రక్తపు మరకలు తను నేలమీదేసుక్కూచున్న గుడ్డ తీసి ఆ మరకలు తుడిచేశాడు

'శెప్పు పాడయిపోయింది ఇప్పుడీ ముండల కంపెనీ వోడేం గొడవ జేత్తాడో' అనుకుంటూ వుండగానే వాడొచ్చాడు

"బాబుగారూ మన్నించాలి బాబుగారూ శెప్పు కుక్కముండీడుసుకుపోయింది పట్టీ తెగపోయింది శెమించండి బాబూ "

"బంగారం వంటి శెప్పు పాడుజేసి, ఇంకా క్షమించమంటావేరా రాస్కెల్ నీకు డబ్బులిచ్చేది చెప్పులు కుక్కలకప్పజెపటానికిరా ఇరవై రూపాయల జోడది డబ్బు కట్టరా

"తమరట్టా అంటే నేనేం శెయ్యగలను బాబూ పొరపాటయిపోయింది శెమించమంటన్నా గందా అంత డబ్బు నేనెక్కడ్నించి తేగలను బాబూ నా దగ్గర ఇదిగో ఈ యాభై అయిదు పైసలూ వుండయ్, ఇయ్ తీసుకుని శెప్పు బాగుచేయించుకోండి దొరా "

కోటిగాడి చెంప ఛెళ్ళుమంది ముందుకి చాచిన చేతులోంచి, పైసలెగిరి, నేల మీద చెల్లాచెదురుగా దుమ్ములో పడ్డాయి

"నోటికొచ్చినట్టల్లా కూస్తావురా దొంగలంజకొడుకా నేనేం ముష్టివాడినన్నుకున్నావురా చెప్పంతా చెడగొట్టి బాగు చేయించుకోమని అర్ధరూపాయి ఇస్తావ్? ఎంత పొగర్రా నీకు" అని ఇంకా నాలుగు బూతులు తిట్టి, చెప్పులు అట్లాగే తొడుక్కుని, కాళ్ళీడ్చుకుంటూ పోయాడు

ముండల కంపెనీ వాడు.

కోటిగాడికి కోపమొచ్చింది. ఏడుపొచ్చింది. కళ్ళంట నీళ్ళు తిరిగాయి. ఆకలి పేగులు తినేస్తోంది. దెబ్బ బాగా తగిలింది. దవడ నొప్పిగా వుంది. నీరసం... ఆయాసం .. కళ్లు తిరుగుతున్నట్టుగా వుంది.

చీకటి పడుతోంది. గుళ్ళో కొచ్చే భక్తుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతోంది. దుమ్ములో పైసల కోసం వెతికాడు కోటిగాడు. ముప్పైపైసలే దొరికాయ్. ఇంకో పావలాబిళ్ళ కనపడలేదు. ఇంక వెతకలేక మెల్లగా లేచివెళ్ళి, గుడి గుమ్మం పక్కనున్న అరుగు మీద కూలబడ్డాడు. కాళ్ళు లాగుతున్నాయి. కళ్ళు మూసుకుని పడుకున్నాడు. పుట్టింది మొదలూ పడ్డ బాధలూ.. చూసిన లోకం.. మోసాలూ, పాపాలూ, కుట్రలూ, చచ్చినకుక్క, ముండల కంపెనీ వాడి తిట్లు, దెబ్బ.. ఈ దృశ్యాలన్నీ ఆలోచనలన్నీ కళ్ళముందు కదిలాయి. మనసు చుట్టూ మూగాయి. "ఈ పెపంచకంలో నాయంగా ధర్మంగా నడిశేవోడు బతకలేడు... అట్టాంటోళ్ళకి దేముడూ సాయం శెయ్యడు.." అనుకున్నాడు.

* * *

రాత్రి పదిగంటలయింది. బజారంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది. గుడి చుట్టుపక్కల నున్న దుకాణాలన్నీ మూసేశారు. గుడి సింహద్వారం తలుపులు వోరగా వేసి వున్నాయి. ఒక పూజారి రాత్రంతా గుళ్ళోనే వుంటాడు.

అరుగు మీద మగత నిద్ర పోయిన కోటిగాడు లేచి కూర్చున్నాడు. కాఫీ నీళ్ళు తాగినా బాగుణ్ణు అనుకున్నాడు. కాఫీ తాగాంలంటే కనీసం రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళాలి. నడిచే ఓపిక లేదు. లోపలికెళితే పూజారి పెసాదమేమయినా పెడ్తాడేమో" అనుకుని లేచి మెల్లగా గుడి ఆవరణలోకి ప్రవేశించాడు.

గుళ్ళో అంతా చీకటి. లోఫర్లూ, దాఫర్లూ, ఖూనీకోర్లూ, మనిషి వేషాలేసుకున్న తోడేళ్ళూ, గుంటనక్కలూ, నాగుపాములూ అక్కడ కడిగేసుకుపోయిన పాపాలన్నీ గడ్డకట్టినట్టుగా వుంది ఆ చీకటి. ఆ చీకటికి జడిసిపోయి గర్భగుడిలో దేవుడిముందు ఉన్న చిన్న దీపం తల వంచుకుని భయం భయంగా వెలుగుతోంది. ఆ వెలుగులో వెంకటేశ్వరుడి నల్లరాతి విగ్రహం మరీ నల్లగా కనిపిస్తోంది.

గర్భగుడిలో ఎవరూ లేరు, దేవుడు తప్ప.

కోటిగాడు పూజారి కోసం వెతికాడు. గర్భగుడి పక్క నుంచి, దేవాలయం వెనక ఖాళీగా వున్న దొడ్లోకి దారి ఉంది. అటు వెళ్ళి చూశాడు. ఆ దొడ్లో గన్నేరు చెట్టు కింద పువ్వులమ్మే కాంతమ్మని గట్టిగా కావిలించుకుని ముద్దెట్టుకుంటున్నాడు, పూజారి.

కోటిగాడు వెనక్కి వచ్చేశాడు. మెల్లగా గర్భగుడిలోకి వెళ్ళాడు. దేవుడి కోసం పెట్టిన చక్కెర పొంగలి, పులిహోర, లడ్డూలు, కొబ్బరిముక్కలూ దేవుడు తినలేదు. కోటిగాడు ఆత్రంగా చేతికి దొరికినంత , పొట్ట పట్టినంత తినేశాడు. ఆకలి తీరింది. లేచి నిలబడ్డాడు. దేవుడి కేసి చూశాడు. మరి కాస్సేపటికి ఆరిపోవడానికి సిద్ధంగా వున్న గుడ్డిదీపపు వెలుతురులో దేవుడి మెడలోనూ, దేవేరి మెడలోనూ వున్న నగలు మెరుస్తున్నాయి. ఆ నగలన్నీ వొలిచి మూట గట్టాడు.

చేతులు జోడించి "నన్ను క్షమించు సామీ' అని చెంపలేసుకుని నగల మూట బొడ్లో దోపుకుని గబగబ గుళ్ళోంచి బయటికి వెళ్ళిపోయాడు.

దేవుడు మంచివాడు. పాపం ఏమీ అన్లేదు. చూస్తూ వూరుకున్నాడు. ●

*(జ్యోతి: దీపావళి ప్రత్యేక సంచిక - 1970)*